క్లుప్తంగా

ప్రభుత్వ భూమి కబ్జాపై తహసీల్దారుకు ఫిర్యాదు

తగరపువలస: ఆనందపురం మండలం రామవరం గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 121లో 8 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని ఆ పంచాయతీకి చెందిన వ్యక్తులు సోమవారం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దేవుడుబాబు, పెంటయ్యా అనే వ్యక్తులు మాట్లాడుతూ స్మార్ట్ టౌన్‌షిప్‌కు కేటాయించిన ఈ భూమిని టీడీపీకి చెందిన అగరపు దేముడుబాబు, అగరపు గంగరాజు అనే వ్యక్తులు కబ్జా చేశారన్నారు. ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

సామాజిక చైతన్యంతోనే నేరాల అదుపు

కొమ్మాది: సామాజిక చైతన్యం ద్వారానే సైబర్ నేరాలు అదుపు చేయడం సాధ్యపడుతుందని ఎంపీ, గీతం అధ్యక్షుడు ఎం. శ్రీ భరత్ అన్నారు. గీతం మహిళా సాధికారిత విభాగం, టెక్ మాంత్రిక్ ఐటీ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన వుమెన్ అండ్ టెక్నాలజీ సదస్సులో ఆయన మాట్లాడారు. సాంకేతికంగా అభివృద్ధి సాధిస్తున్నా, నేరపూరిత స్వభావం, మనుషుల మధ్య నమ్మకం సన్నగిల్లడంతో ప్రతి ఒక్కరిని అనుమానంగా చూడటం పెరుగుతోందన్నారు. మహిళలు మానసికంగా దృఢంగా ఉన్నప్పుడు సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీ శంఖబ్రత బాగ్చి, సింబయాసిస్ అధినేత ఒ.నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

భీమునిపట్నం: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భీమిలి జోనల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ కార్మికులకు ఆరు నెలల నుంచి పనిముట్లు సరఫరా చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే రిటైర్ అయిన కార్మికుల స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో కార్మికులపై పని భారం పెరిగిందని తెలిపారు.

హిందీ లోయర్ పరీక్ష ఫలితాల విడుదల

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ, చెన్నై ఆధ్వర్యంలో గత సెప్టెంబరులో నిర్వహించిన లోయర్ పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక పరీక్ష ఫలితాలు సోమవారం విడుదల అయ్యాయి. భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి ద్వారా 34 మంది విద్యార్థులకు గాను 33 మంది హాజరు కాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారు. 2025 ఫిబ్రవరిలో జరిగే పరీక్షలకు సంబంధించి ఉచితశిక్షణ, ఫీజు చెల్లింపు తదితర వివరాలకు 89858 97419, 89856 47419 నంబర్లలో సంప్రదించాలని మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు కోరారు.

నవంబర్ 29 నుంచి 'విరాట్-24'

పీఎం పాలెం: ఆళ్వార్‌దాస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మేనేజ్‌మెంట్ ఈవెంట్ విరాట్-24ను ఈ ఏడాది నవంబర్ 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(సిమ్స్)కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికా దాస్ తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ ఫెస్ట్‌లో రాష్ట్ర నలుమూలల నుంచి ఎంబీఏ, బీబీఏ, లా కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని తెలియజేశారు.

పశువులకు పౌష్టికాహారం అందించాలి

తగరపువలస: చూడితో ఉన్న పశువులకు ప్రత్యేకంగా పౌష్టికాహారం అందించాలని ఆనందపురం పశువైద్యాధికారి అనిల్‌కుమార్ రైతులకు సూచించారు. ఇటీవల ముచ్చర్ల పంచాయతీకి చెందిన పాడిరైతు సురేష్‌బాబుకు చెందిన పాడి గేదెకు పుట్టిన దూడకు ప్రేవులు బయటకు ఉండిపోవడంతో, దానికి సోమవారం హెర్నియా శస్త్రచికిత్స చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చూడితో ఉన్న పశువులకు అందించవలసిన దాణా గురించి వివరించారు.

పిక్క వేశారు.. తారు మరిచారు



గంధవరం సమీపంలో తారు వేయకుండా వదిలేసిన రోడ్డు



కొత్తకొవ్వాడ సమీపంలో తారు వేయకపోవడంతో పిక్కలు తేలిన రోడ్డు



గంధవరం సమీపంలో గోతులు పడిన రోడ్డు

- మూడు కి.మీ.మేర ఇదే పరిస్థితి
- రాళ్లు తేలడంతో రాకపోకలకు అవస్థలు
- వర్షం పడితే నరకం చూస్తున్న ప్రయాణికులు

పద్మనాభం: రహదారి నిర్మాణ పనులను అసంపూర్తి వదిలేయడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని పాత కొవ్వాడ నుంచి గంధవరం వరకు పిక్క వేసి, తారు వేయకపోవడంతో రోడ్డంతా రాళ్లు తేలిపోయింది. చాలాప్రాంతాల్లో మళ్లీ గోతులు పడుతున్నాయి. దీంతో ఆ మార్గంలో ప్రయాణమంటేనే హడలిపోతున్నారు. పాత కొవ్వాడ నుంచి గంధవరం వరకు సుమారు నాలుగు కిలోమీటర్లు నిడివి గల రోడ్డు పూర్తిగా శిథిలమైంది. దీనికి మరమ్మతులు చేసి, బీటీగా అభివృద్ధి చేసేందుకు రూ.40 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఫిబ్రవరి నెలలో అక్కడక్కడ తారు వేసి అభివృద్ధి చేశారు. ఇంకా మూడు కిలో మీటర్ల నిడివి గల రోడ్డుపై నల్ల పిక్క వేసి, రోలింగ్ చేసి వదిలేశారు. తారు వేయకుండా వదిలేయడంతో వాహనాల రాకపోకలకు పిక్కలు తేలిపోయాయి. గోతులు పడ్డాయి. పిక్క వేసి ఎనిమిది నెలలైనా తారు వేయకుండా వదిలేయడంతో రోడ్డు మొత్తం రాళ్లు తేలిపోయాయి. ఈ రోడ్డుపై పద్మనాభం మండలం అనంతవరం, పెంట, దేవరపాలెం, పాత కొవ్వాడ, కొత్త కొవ్వాడ, గంధవరం, విజయనగరం జిల్లా జామి మండలం నారాయణపురం, అలమండ ప్రాంతాలకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రోడ్డు రాళ్లు తేలి, గోతులు పడడంతో వాహనచోదకులు దీనిపై ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులు నడిచి వెళ్లడం కూడా కష్టమవుతోంది. వాహనం స్కిడ్ అవడంతో ద్విచక్రవాహనచోదకులు ప్రమాదాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే పనులు

రోడ్డు పనులు నిలిచిపోవడంపై ఆర్ అండ్ బీ శాఖ ఇంజినీరింగ్ అధికారులను వివరణ కోరగా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారని తెలిపారు. గ్రాంట్ మంజూరైందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలియజేశారు.

నడిచి వెళ్లాలన్నా కష్టమవుతోంది



వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా దిగిపోవడంతో రోడ్డు గురించి ఎవరూ పట్టించుకోలేదు. రోడ్డంతా పిక్క తేలిపోయింది. మేము పాత కొవ్వాడ, కొత్త కొవ్వాడ గ్రామాలకు ఈ రోడ్డు మీదుగానే వెళ్తాం. తారు వేయకపోవడంతో రాళ్లమీద నుంచి నడిచి వెళ్లడం చాలా కష్టమవుతోంది. అధికారులు స్పందించి, పనులు పూర్తి చేయాలి.

– కె.రాము, నారాయణపురం

వాహనాలు పాడవుతున్నాయి



తారు వేయకుండా వదిలేయడంతో రోడ్డు గోతులు పడుతోంది. ఇప్పటికే చాలాచోట్ల గోతులు పడ్డాయి. ఈ రోడ్డుపై వెళ్తుంటే వాహనాల టైర్లు పాడైపోతున్నాయి. ధూళి రేగుతోంది. ప్రయాణం ఇబ్బందికరంగా ఉంటోంది. తారు వేసి రోడ్డు పూర్తి చేయాలి. అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలి.

–జి.ఈశ్వరరావు, దేవరపాలెం

కోటిన్నర స్థలం కొట్టేసేందుకు స్కెచ్

పట్టించుకోని రెవెన్యూ అధికారులు



ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ స్థలం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ స్వర్ణ భారతి నగర్‌లో దాదాపు కోటిన్నర విలువ చేసే సుమారు 300 గజాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు ఇద్దరు పక్కా స్కెచ్‌తో ముందుకు వెళ్తున్నారు. దీనిపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనా, అధికారులు ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. స్వర్ణ భారతి నగర్‌లో గజం స్థలం లక్షల్లో పలుకుతోంది. ఇక్కడ ప్రైవేటు స్థలం కొందామన్నా దొరకని పరిస్థితి. దీంతో బడాబాబుల దృష్టి ప్రభుత్వ భూములపై పడింది. ఈ నెల 24న స్థలాన్ని ఆక్రమించేందుకు ఓ బడా వ్యక్తి ప్రయత్నం చేసిన నేపథ్యంలో విషయం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. కానీ, రెవెన్యూ అధికారులు మాత్రం మౌనం పాటిస్తున్నారు. ఇప్పటివరకు ఆ స్థలాన్ని పరిశీలించడం కానీ, పరిరక్షించేందుకు హెచ్చరిక బోర్డులు గానీ ఏర్పాటు చేయడం లేదు. అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే సహకారంతో ఓ వ్యక్తి ఈ స్థలాన్ని ఆక్రమిస్తున్నాడని, అందుకే రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఆర్‌ఐ కిషోర్‌ను వివరణ కోరగా ఆక్రమించిన స్థలం ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. అయితే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా ఎవరో ఒకరు తొలగించేస్తారని ఏర్పాటు చేయలేదని చెప్పడమే హాస్యాస్పదంగా ఉంది.

జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు

ఇక్కడి ఆక్రమణలపై రుషికొండకు చెందిన పలువురు నాయకులు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. సర్వే నెంబరు 17 (1), (2), (5) లో రెండెకరాల భూమిలో ఎల్‌పీ నెంబర్ 90/97 ఈడబ్ల్యూఎస్ లేఅవుట్ సమీపంలో సర్వే నెంబర్ 18, 19 లలో కొంత ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైందని, వీటిపై విచారణ జరిపించి, ఇక్కడి అక్రమ కట్టడాలను తొలగించాలని పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు.

డబ్బు ఇవ్వడానికి నిరాకరించిన వ్యక్తిపై దాడి

రూ.2000, సెల్‌ఫోన్‌తో పరారీ

పీఎం పాలెం: ఓ వ్యక్తిపై దాడి చేసి రూ. 2000, సెల్‌ఫోన్ బలవంతంగా లాక్కుని పరారైన ఉదంతంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. నీలతి అప్పలనాయుడు ఎండాడలో టీఎస్సార్ ప్రెస్టేజస్-1 అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. రుషికొండ వీ కంఫర్ట్‌లో బాయ్‌గా కూడా చేస్తున్నాడు. మేనకోడలి పెళ్లికి ఈ నెల 27వ తేదీన పార్వతీపురం వెళ్లిన అప్పలనాయుడు అదే రోజు రాత్రి 11.30 గంటలకు ఎండాడ వద్ద ఆర్టీసీ బస్సు దిగి కాలి నడకన తన నివాసానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో విజయావైన్స్ ఎదురుగా ఉన్న రోడ్డులో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అడ్డగించి, తన వద్ద ఉన్న డబ్బులు ఇవ్వవలసిందిగా గద్దించారు. అందుకు నిరాకరించడంతో బీర్ బాటిల్‌తో తలపై కొట్టి గాయపరిచారు. అతని వద్ద సెల్ ఫోను, రూ.2000 నగదు లాక్కుని పరారయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

సైకిళ్లపై శబరిమలై యాత్రకు..



సైకిళ్లపై బయల్దేరిన స్వాములు

తగరపువలస: అయ్యప్ప దీక్ష చేపట్టిన నలుగురు స్వాములు సోమవారం సైకిళ్లపై శబరిమలైకు పయనమయ్యారు. వీరంతా తగరపువలస నుంచి బయల్దేరి వెళ్లారు. 15 నుంచి 18 రోజులలో సన్నిధానానికి చేరుకోనున్నట్టు బ్యాంక్ కాలనీకి చెందిన గురుస్వామి దారపు సూరిబాబు(చిన్నా స్వామి) తెలిపారు. ఆయనతో పాటు తాళ్లవలసకు చెందిన విజ్జపు సంతోష్, తగరపువలసకు చెందిన మార్గాన ప్రసాద్, ఎల్. అనిల్ స్వాములు ఉన్నారు. వీరికి తగరపువలసకు చెందిన గురుస్వాములు బోని ఈశ్వరరావు, పల్లా శ్రీను, నక్కెళ్ల గోపి, కార్తీక్ వీడ్కోలు పలికారు.

కూలేందుకు సిద్ధంగా..



ప్రమాదకరంగా ఉన్న హెచ్‌టీ విద్యుత్ స్తంభం (ఇన్‌సెట్) పూర్తిగా దెబ్బతిన్న భాగం)

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డు ఐటీ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు కాలనీలోని ఓ విద్యుత్ స్తంభం కూలడానికి సిద్ధంగా ఉంది. ఆర్టీసీ కాలనీ, ఐటీ సెజ్ ప్రాంతాల నుంచి కాలనీలోని శ్రీ లలితా త్రిపుర సుందర సమేత మహా కామేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఈ స్తంభం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న హెచ్‌టీ విద్యుత్ స్తంభం మొదలు పూర్తిగా విరిగిపోయింది. 8ఏపీఈఎస్ ఏపీఈపీడీసీఎల్ నెంబరు గల పోల్‌ను కొన్నాళ్ల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో స్తంభం కిందిభాగం దెబ్బతిని, లోపల ఉన్న కొన్ని వైర్ల ఆధారంగా నిలబడింది. గట్టి గాలి వీస్తే స్తంభం ఊగుతోందని, ఎప్పుడే ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పీఎం పాలెం: ద్విచక్రవాహనం పైనుంచి ప్రమాదవశాత్తు పడిపోయిన మహిళకు తీవ్రగాయాలయ్యాయి. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. పల్లికరణం దుర్గారావు తన తల్లి పార్వతితో కలసి బైక్‌పై సోమవారం శ్రీరామ్ ప్రాపర్టీ రోడ్డులో వెళ్తున్నాడు. సడన్ బ్రేక్ వేయడంతో, అతని తల్లి కింద పడిపోయారు. తీవ్ర గాయాలైన ఆమెను చికిత్స నిమిత్తం గీతం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

తర్లువాడ, గిడిజాలలో ఎంపీడీవో పర్యటన



గిడిజాల పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంపీడీవో జానకి

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడ, గిడిజాల పంచాయతీలలో ఎంపీడీవో వి.జానకి సోమవారం పర్యటించారు. గిడిజాల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. అనంతరం ఆ రెండు పంచాయతీలలో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను పరిశీలించారు. వాటి తయారీ, నిర్వహణకు సంబంధించి సూచనలు చేశారు. ఆమెతో పాటు సర్పంచ్ షిణగం అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి ధనుంజయ్ తదితరులు ఉన్నారు.

పవిత్రాలకు ప్రత్యేక పూజలు

వైభవంగా అనంత పద్మనాభస్వామి పవిత్రోత్సవాలు



పవిత్రాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న రుత్వికులు, భక్తులు

పద్మనాభం: అనంత పద్మనాభ స్వామి పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, అగ్ని మథనం , అగ్ని ప్రతిష్ఠాపన, నిత్య హోమాలు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా తమిళనాడు రాష్ట్రం శ్రీరంగం నుంచి తీసుకువచ్చిన పవిత్రాలతో రుత్వికులు, భక్తులు కుంతీ మాధవ స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. సాయంత్రం నిత్య హోమం, మూల తంత్ర హోమం నిర్వహించారు. పవిత్రాలకు పూజలు జరిపారు. కార్యక్రమంలో భక్త బృందం సభ్యులు బోని సన్యాసి నాయుడు, రామసింగు సన్యాసిరావు, తాలాడ పైడిరాజు, మొకర సన్నిబాబు, భక్తులు పాల్గొన్నారు.

రూ.15వేలు విరాళం

పవిత్రోత్సవాలకు బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవి కుమార్, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు రూ.15వేలు విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో హంస మహేష్ పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించని కూటమి ప్రభుత్వం



గుజ్జు రామునాయుడు భవన్‌లో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

తగరపువలస: కూటమి ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు గడుస్తున్నా ప్రజల సమస్యలపై దృష్టి పెట్టడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో సోమవారం నిర్వహించిన భీమిలి ఏరియా పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేసి సంవత్సరాలు గడుస్తున్నా, నిర్మాణం కాలేదన్నారు. ప్రజలు బస్సుల కోసం ఎండా, వానల్లో నిరీక్షించాల్సి వస్తోందని, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తక్షణం పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. రైతు బజారు నిర్మాణం పూర్తయినా ప్రారంభించడానికి కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించి, రైతు బజారు తెరిపించడమే తమ ప్రధాన డిమాండ్లని పేర్కొన్నారు. మోర అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ నాయకులు అల్లు బాబూరావు, కానూరి రాంబాబు, కొండపు ఈశ్వరరావు, చిల్ల రాంపైడి, చిల్ల అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

కళాసాహితి నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలోని కళాసాహితి సంస్థ నూతన కార్యవర్గ ఎన్నిక భీమిలి ప్రెస్‌క్లబ్ వద్ద సోమవారం జరిగింది. సంస్థ గౌరవ అధ్యక్షునిగా రేలంగి పెదబాబు, అధ్యక్షునిగా పాత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ, ప్రధాన కార్యదర్శిగా అడిదం సన్యాసిరాజు, కోశాధికారిగా కాళ్ల సన్ని తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కంటుభుక్త రామానాయుడు, మునుకుట్ల కోటయ్య, పిట్ట సురేష్, మైలిపల్లి లక్ష్మణరావు, ఎస్.జోగరావు, సహ కార్యదర్శులుగా అడిదం, కిశోర్, పోలిపల్లి శ్రీనివాసరావు, మునునూరి సూర్య శ్రీనివాస్, పోతిన అరవింద్, కిలాని అప్పారావు, ఎల్.ఆదినారాయణ ఎన్నికయ్యారు. సంస్థ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌వర్మ మాట్లాడుతూ అంతరించి పోతున్న కళలను పోత్సహించడంతో పాటు పేద కళాకారులకు తమ వంతు సాయం అందిస్తామని తెలిపారు.

బీమా పథకాలపై మత్స్యకారులకు అవగాహన



మాట్లాడుతున్న ఫీల్డ్ ఆఫీసర్ బాబూరావు

తగరపువలస: మత్స్యకారులకు బీమా పథకాలపై సోమవారం అవగాహన కల్పించారు. చిట్టివలస స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మత్స్యకార శాఖ సంయుక్తంగా తాటితూరు సంప్రదాయ మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు సింగిడి గణేష్ ఆధ్వర్యంలో కొండపేటలో నిర్వహించిన కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ బాబూరావు మాట్లాడారు. బీమా పథకాల గురించి వివరించి రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. ప్రధానమంత్రి బీమా సురక్షా యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాల గురించి వివరించారు. మత్స్యశాఖ అధికారులు సుమాంజలి, దేవి మాట్లాడుతూ నాబార్డ్ పథకాలతో పాటు నేషనల్ ఫిషింగ్ డిజిటల్ ప్లాట్‌ఫాం ఉపయోగాల గురించి వివరించారు. మత్స్యకారులతో పాటు ఇతర అసంఘటితరంగ కార్మికులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకుని బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్ పత్రి సత్యానంద ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 88859 21216 నంబరులో సంప్రదించాలని సూచించారు.

జోన్-2 పీజీఆర్‌ఎస్‌కు 15 వినతులు

వీధిలైట్లు వెలగడం లేదని సీపీఐ ఫిర్యాదు



భీమిలి జెడ్సీ ప్రసన్నవాణికి వినతిపత్రం అందిస్తున్న జ్యూట్‌మిల్లు లాకౌట్ కార్మిక సంఘం ప్రతినిధులు

మధురవాడ: జీవీఎంసీ జోన్-2 పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో 15 దరఖాస్తులు వచ్చాయి. మధురవాడలోని కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్సీ సింహాచలం వినతులు స్వీకరించారు. మధువాడలో వీధిలైట్లు వెలగడం లేదని సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. పార్టీ నాయకుడు సత్యనారాయణ, మహిళా సంఘం నాయకురాలు ఎం.ఎ.బేగం మాట్లాడుతూ 8వ వార్డు పాత మధురవాడ, చంద్రంపాలెం తదితర ప్రాంతాల్లో వీధిలైట్లు నెలల తరబడి వెలగడం లేదని స్థానికులు తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఏడో వార్డు సుద్దగెడ్డలో వీధిలైట్లు, తాగునీటి సమస్యలపై అలాగే ఆరిలోవ, రుషికొండ ప్రాంతాల్లో ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చాయి. జోన్ పరిధిలోని 5నుంచి 13వరకు గల 9 వార్డులు పరిధిలో వివిధ సమస్యలుపై 15 అర్జీలు వచ్చాయి. వీటిపై చర్యలు చేపడతామని జెడ్సీ తెలిపారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

జ్యూట్‌మిల్లు స్థలాల్లో అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లుకు చెందిన స్థలాలలో నిర్మిస్తున్నవన్నీ అక్రమ నిర్మాణాలేనని, వాటిని అడ్డుకోవాలని కోరుతూ మిల్లు లాకౌట్ బాధిత సంఘం ప్రతినిధులు.. భీమిలి జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణికి సోమవారం వినతిపత్రం అందించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఆమెను కలిసిన సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ జ్యూట్‌మిల్లు కార్మికులకు, గ్రాట్యుటీ, వేతనాలు, పీఎఫ్ బకాయిలు చెల్లించకుండానే, యాజమాన్యం స్థిరాస్తులను రియల్ ఎస్టేట్ సంస్థలకు విక్రయించేస్తోందన్నారు. దీనిపై కోర్టు ఇచ్చిన స్టేటస్ కో ఆర్డర్‌ను ఈ నెల 4న జాయింట్ లేబర్ కమిషనర్ సునీత ద్వారా జీవీఎంసీకి పంపించినట్టు గుర్తు చేశారు. అందువలన జీవీఎంసీ అధికారులు మిల్లు స్థలాల్లో జరుగుతున్న నిర్మాణాలు అడ్డుకోవాలని కోరారు. జెడ్సీకి వినతి పత్రం అందించిన వారిలో ఎరబాల తాతారావు, జీరు వెంకటరమణ, పాశల శివ, మాకాల శంకరరావు, సింగిడి అప్పారావు, దాలయ్యరెడ్డి ఉన్నారు.

బంగారమ్మ ఉత్సవాలు ప్రారంభం

పద్మనాభం: మండలంలోని మద్దిలో బంగారమ్మ ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలేళ్ల సంబరంలో భాగంగా అమ్మవారి ప్రతిమలైన ఘటాలను గ్రామంలో ఊరేగించారు. అమ్మవారి ఆలయం, పరిసర ప్రాంతాలు విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి. మంగళవారం అనుపు ఉత్సవం జరిపిస్తామని నిర్వాహకులు తెలిపారు.

మందుబాబులకు రూ.లక్ష జరిమానా

పీఎం పాలెం: మద్యం సేవించి ద్విచక్రవాహనాలు నడిపిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి, అపరాధ రుసుము వసూలు చేసినట్లు పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. వివరాలివి.. ఇటీవల జాతీయ రహదారిపై నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మద్య సేవించి ద్విచక్రవాహనాలు నడుపుతున్న 10 మందిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. వారిని సోమవారం కోర్టులో హాజరు పరచగా, న్యాయస్థానం ఒక్కొక్కరికీ రూ.10 వేలు వంతున లక్ష రూపాయలు జరిమానా విధించిందని పేర్కొన్నారు.

ఆనందపురం పీఎస్ పరిధిలో..

తగరపువలస: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 10 మందికి సోమవారం భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య జరిమానా విధించారు. ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున మొత్తం రూ.లక్ష జరిమానా విధించారు.

ప్రభుత్వ కళాశాల స్థలంలో మళ్లీ ఆక్రమణలు

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం కేటాయించిన స్థలంలో సోమవారం మళ్లీ ఆక్రమణలు వెలుగు చూశాయి. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు ఆనందపురం తహసీల్దార్ ఇటీవల ఆక్రమణలు తొలగింపచేసిన సంగతి తెలిసిందే. ఐతే, ఆక్రమణదారులు మళ్లీ యథేచ్ఛగా ఆ స్థలంలోకి ప్రవేశించి వస్తువులను, పశువులను ఉంచారు. ఈ మేరకు తహసీల్దార్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఆక్రమిత స్థలాన్ని ఖాళీ చేయకపోతే చట్ట ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

యానిమేషన్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు

తగరపువలస: యానిమేషన్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. అంతర్జాతీయ యానిమేషన్ దినోత్సవం సందర్భంగా యానిమేషన్ చిత్రాల ప్రదర్శన, వర్క్‌షాపు, కళాకృతుల గురించి విద్యార్థులకు తెలియజేశారు. డ్రాయింగ్, పెయింటింగ్, తోలుబొమ్మలు అలాగే వస్తువులను యానిమేట్ చేయడం గురించి వివరించారు. కమ్యూనికేషన్ రంగానికి యానిమేషన్ గొప్ప అవకాశమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, ఈగల సంజీవి, బుగత మల్లిక పాల్గొన్నారు.